క్లుప్తంగా

18 నుంచి జగనన్నే మా భవిష్యత్తు

సదుం: మండలంలో ఈనెల 18 నుంచి 26 వరకు జగనన్నే మాభవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు సచివాలయాల మండల కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, మంత్రి పెద్దిరెడ్డి పీఏ మురళీ కృష్ణారెడ్డి పాల్గొననున్నట్టు చెప్పారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు విరుపాక్షమ్మ విగ్రహ ప్రతిష్ట

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని అయ్యావాండ్లపల్లె పంచాయతీ ఎర్రంవాండ్లపల్లెలో శుక్రవారం నూతనంగా నిర్మించిన ఆలయంలో విరూపాక్షమ్మ విగ్రహ ప్రతిష్ట నిర్వహిస్తారని గ్రామస్తులు తెలిపారు. ఉదయం కలశ పూజ, కుంభాభిషేకం నిర్వహిస్తారని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్


స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్

పులిచెర్ల(కల్లూరు): ఎటువంటి అనుమతులు లేకుండా ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుక తరలిస్తుండగా గురువారం ఎస్ఈబీ పోలీసులు సీజ్ చేసి కల్లూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు సీఐ శ్రీనివాసమూర్తి తెలిపారు. దాడుల్లో ఎస్ఐ కవీశ్వరనాయుడు సిబ్బంది పాల్గొన్నారు.

19న పూర్వవిద్యార్థుల సమ్మేళనం

పలమనేరు: పట్టణంలోని వర్ర చెన్నారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఈనెల 19న ఆదివారం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మార్చి 27, 28 తేదీల్లో నాక్ మూల్యాంకనానికి వెళుతున్న సందర్భంలో కళాశాలకు ఉత్తమ గ్రేడింగ్ కోసం సమావేశాన్ని పూర్వ విద్యార్థులు జయప్రదం చేయాలని అందులో సూచించారు.

నాడు-నేడు పనులకు రూ.40 లక్షల మంజూరు

రొంపిచెర్ల: మండలంలో రెండవ విడత జరుగుతున్న నాడు-నేడు పనులకు ప్రభుత్వం రూ.40 లక్షల నిధులను మంజూరు చేసిందని ఎంఈఓ హసన్‌బాషా తెలిపారు. అయన గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నాడు నేడు పథకంలో రెండవ విడత 13 పాఠశాలలను ఎంపిక చేసిందన్నారు. ఈ పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం, తాగునీటి, విద్యుత్, ప్రహరీ గోడల నిర్మాణం వంటి పనులను చేపట్టామని తెలిపారు. ఇప్పటి వరకు చేసిన పనులకు బిల్లులు వచ్చాయని చెప్పారు. దీనిని దృష్టిలో పెట్టుకుని నాడు నేడు పనులను వేగవంతం చేయాలని ఎంఈఓ కోరారు.

104 వైద్యసేవలు

పుంగనూరు: మండలంలోని నెక్కుంది గ్రామ పంచాయతీ కేంద్రంలో 104 డాక్టర్లు సృజన, సింధు గురువారం వైద్యసేవలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో 40 మందికి వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేసినట్లు డాక్టర్ సృజన తెలిపారు. వేసవికాలంలో ప్రజలు మంచినీటిని కాచి వడపోసి తాగాలన్నారు. అలాగే నిల్వ చేసిన తిండి పదార్థాలను తినరాదని సూచించారు.

సదుం పంచాయతీకి రూ.9.14 లక్షల ఆదాయం


సదుం: వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

సదుం: సదుం మేజర్ పంచాయతీ ఆదాయ వనరులకు గురువారం పంచాయతీ కార్యాలయ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహించారు. వారపు సంత రూ.7.50 లక్షలు, దినసరి కూరగాయల మార్కెట్ రూ.36,500, ప్రైవేటు బస్టాండు రూ.76 వేలు, పూల మార్కెట్ రూ.50 వేలు, జంతువధశాలకు రూ. 2 వేల ఆదాయం వచ్చినట్టు ఎంపీడీఓ వరప్రసాద్ తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, సర్పంచ్ ఉషారాణి, ఉప సర్పంచ్ బాబురెడ్డి, ఈఓ హసీనా పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు

పలమనేరు: పట్టణానికి చెందిన వాసవి ఆర్యవైశ్య వాట్సాప్ గ్రూపు సభ్యులు రోజుకో రూపాయి చొప్పున ఆదా చేసిన నగదుతో పట్టణంలోని ప్రతిభచూపిన విద్యార్థులకు స్థానిక వాసవి కల్యాణమండపంలో గురువారం ప్రోత్సాహకాలను అందించి వారిని ఘనంగా సన్మానించారు. పట్టణానికి చెందిన ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

అమరజీవికి ఘన నివాళి

కుప్పం: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని కుప్పం పట్టణంలో గురువారం నిర్వహించారు. ఎమ్మెల్సీ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ డా. సుధీర్, ఏఎంసీ చైర్మన్ విద్యాసాగర్ అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం పట్టణ బాలుర ఉన్నత పాఠశాల వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పించారు. అదేవిధంగా పట్టణంలోని ఆర్యవైశ్య సంఘ నేతలు జయంతి వేడుకలు జరుపుకున్నారు. మున్సిపల్ కమిషనర్ రవిరెడ్డి, కౌన్సిలర్లు మోహన్‌రామ్, జాకీర్, రాజ్‌కుమార్, రంగయ్య, సురేష్, దాము, విజయ్ , ఆర్యవైశ్య సంఘనేతలు గ్యాస్ చంద్రశేఖర్, సతీష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.


కుప్పంలో మున్సిపల్ చైర్మన్ డా.సుధీర్ నివాళి

త్యాగమూర్తి పొట్టి శ్రీరాములు

పలమనేరు: పట్టణంలోని బజారువీధిలో అమరజీవి పొట్టిశ్రీరాములు 122వ జయంతి వేడుకలను గురువారం ఆర్యవైశ్యసంఘ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి విచ్చేసిన పెద్దలు మాట్లాడుతూ దేశంలో భాషాసంయుక్త రాష్ట్రాలకు ఆయనే పితామహుడన్నారు. ఆంధ్ర రాష్ట్రంలోసం ఆయన చేసిన త్యాగాన్ని మనం గుర్తుంచుకోవాలన్నారు. అదేవిధంగా మున్సిపల్ కార్యాలయంలో అమరజీవికి అధికారులు నివాళులర్పించారు.

పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిది..

కుప్పంరూరల్: అడవిబూదుగూరు పాఠశాలలో పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని పాఠశాల ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయులు చిట్టిబాబు, ఉపాధ్యాయులు నాగమ్మ పాల్గొన్నారు.

ఘనంగా పొట్టిశ్రీరాములు జయంతి..

పులిచెర్ల(కల్లూరు): పొట్టి శ్రీరాములు జయంతిని గురువారం కల్లూరు పంచాయతీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పంచాయతీ ఈఓ యుగంధర్ పాల్గొన్నారు.

పొట్టిశ్రీరాములకు నివాళి..

చౌడేపల్లె: వాసవీ వనిత క్లబ్ ఆధ్వర్యంలో బజారువీధిలో వెలసిన శ్రీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమరజీవి జయంతిని పురస్కరించుకుని పేదలకు పౌష్టికాహారాన్ని అందజేశారు. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఇస్పా నాగలక్ష్మి, సంఘ నేతలు నిర్మలాదేవి, జయచంద్ర ప్రసాద్, రామ్‌కుమార్, ఉషారాణి, శ్రీనాథ్, పుష్పలత, లోకేష్, లలిత, కుమారి, రాణి, చంద్రకళ పాల్గొన్నారు.

సోమల: నంజంపేట ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెచ్‌ఎం కుసుమాంబ, ఉపాధ్యాయులు దామోదరం, వసంత, రమణబాబు పాల్గొన్నారు. అదేవిధంగా కందూరు బస్టాండులో ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి ఎంపీపీ ఈశ్వరయ్య, సర్పంచ్ బాషా మసూద్ నివాళులర్పించారు.


పలమనేరులోని బజారువీధిలో..


పలమనేరు మున్సిపల్ కార్యాలయంలో..


నంజంపేట పాఠశాలలో..


అడవిబూదుగూరు పాఠశాలలో..


చౌడేపల్లెలో ..


కల్లూరులో..

ఇళ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తిచేయండి

పులిచెర్ల(కల్లూరు): జగనన్న కాలనీల్లో నిర్మిస్తున్న ఇళ్లను సకాలంలో పూర్తిచేయాలని ఎంపీడీఓ సుగుణమ్మ తెలిపారు. పుచ్చలవారిపల్లెలో నిర్మిస్తున్న కాలనీ ఇళ్లను ఆమె గురువారం పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమకు మంజూరు చేసిన ఇళ్లను పూర్తిచేయాలని సూచించారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


పుచ్చలవారిపపల్లెలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

ఇంటర్ పరీక్షకు 24 మంది గైర్హాజర్

పుంగనూరు: ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 24 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు గురువారం పట్టణంలో మూడు సెంటర్లలో పరీక్షలను పర్యవేక్షణాధికారులు రెడ్డెప్ప, కమలాకర్, విజయకుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో మూడు సెంటర్లలో మొత్తం 774 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 750 మంది ద్వితీయ సంవత్సర పరీక్షకు హాజరయ్యారు. 24 మంది విద్యార్థులు గైర్హాజర్ అయ్యారు.

ఆరు కిలోమీటర్లు..తప్పని ఎదురుచూపులు!

- పలమనేరు- తుంబకుప్పం రోడ్డుకు మోక్షమెప్పుడో?
- పలు ప్రాంతాలకు తగ్గనున్న ప్రయాణ దూరం
- అభివృద్ధికానున్న అటవీప్రాంతంలోని గిరిజన గ్రామాలు


పలమనేరు: కేవలం ఆరు కిలోమీటర్ల రోడ్డు మార్గం ఏర్పడితే పలమనేరు, పూతలపట్టు, పుంగనూరు నియోజకవర్గాలకు రాకపోకలు జరిగి పలు ప్రాంతాలకు ప్రయాణదూరం తగ్గనుంది. పలమనేరు నుంచి వయా గాంధీనగర్, జగమర్ల మీదుగా తుంబకుప్పం రోడ్డు పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయోనని ఈ ప్రాంత ప్రజలు ఎదుచూస్తున్నారు. గత ప్రభుత్వంలో ఎన్ని వినతులు చేసినా ప్రయోజనం లేకుండాపోయింది. దశాబ్దాల తమ కల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనైనా నెరవేరేనా అని ఇక్కడి జనం ఎదురుస్తున్నారు. కేవలం అడవిలో ఆరు కిలోమీటర్ల మట్టి రోడ్డును తారురోడ్డుగా మారిస్తే మూడు నియోజకవర్గాల్లో రాకపోకలు పెరగడంతో పాటు ఆ ప్రాంతంలోని గిరిజన గ్రామాలకు మేలు జరుగుతుంది.

కేవలం ఆరు కిలోమీటర్లు మాత్రమే..

పలమనేరు నుంచి వయా గాంధీనగర్, జగమర్ల మీదుగా దేవళంపెంట వరకు గతంలో మట్టిరోడ్డు ఉండగా ఇటీవలే తారురోడ్డు వేశారు. దీంతో ఆర్టీసీ బస్సులు సైతం జగమర్ల దాకా తిరుగుతున్నాయి. గిరిజనులు ఎక్కువగా ఉండే దేవలంపెంట నుంచి తుంబ కుప్పంలకు కేవలం ఆరు కిలోమీటర్లు మాత్రమే. ప్రస్తుతానికి మట్టిరోడ్డు ఉన్నప్పటికీ వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందికరంగా ఉంది. ఈ రోడ్డును బాగుచేసి తారు రోడ్డుగా మార్చితే పలమనేరు, పూతలపట్టు, పుంగనూరు నియోజకవర్గాల్లోని ఆరు మండలాలకు (పలమనేరు, గంగవరం, పెద్దపంజాణి, బంగారుపాళ్యం, తవణంపల్లె, సోమల) రాకపోకలు కలిగి ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది.

అరగొండ, కాణిపాకానికి తగ్గనున్న ప్రయాణ దూరం..

ప్రస్తుతం పలమనేరు నుంచి అరగొండ, కాణిపాకాలకు ఎక్కువగా ప్రజలు వెళుతుంటారు. ముఖ్యంగా అరగొండలో అపోలో వైద్యసేవలు, కాణిపాకంలో


దేవలంపేట నుంచి తుంబకుప్పం వెళ్లే మట్టి రోడ్డు

వినాయకుని ఆలయదర్శనానికి ఈ ప్రాంతం నుంచి పెద్దసంఖ్యలో వెళుతుంటారు. అక్కడికి వెళ్లాలంటే పలమనేరు నుంచి బంగారుపాళెం నుంచి వెళ్లాల్సివస్తోంది. ఈకొత్త మార్గం రెడీ అయితే 25 కిమీదూరం తగ్గుతుంది. మరో వైపు మొగిలి ఘాట్‌లో జరిగే ప్రమాదాలను నివారించవచ్చు. హైవేలో ట్రాఫిక్ తగ్గుతుంది.

పలు ప్రాంతాలకు కలిపే మార్గంలా..

పీలేరు, పూతలపట్టు, తవణంపల్లె, సదుం, సోమల, చౌడేపల్లెలకు వెళ్లేందుకు అనుకూలంగా ఉంటుంది. ఇక పలమనేరు, బంగారుపాళ్యం, తవణంపల్లె, సోమల, పెద్దపంజాణి మండలాలలోని ఆరు మారుమూల అటవీ గ్రామాలకు రాకపోకలు ఏర్పడుతాయి. దీంతో అటవీగ్రామాలైన జగమర్ల, యానాది కాలనీ, కొత్తపల్లె , కీలపట్ల, పెద్దకాప్పల్లి, శెట్టేరి, పెద్ద ఉప్పరపల్లి, మాధవరం, సరకల్లు, వెంగంపల్లి, ఆవులపల్లి, నంజంపేట, నడింపల్లి, నల్లంగాడు, కొత్తూరు మారుమూల పల్లెలకు రవాణాసౌకర్యాలు జరిగి అభివృద్ధి చెందుతాయి. ఇక్కడ గిరిజనులు పండించే మామిడి ఇతరవాటిని రవాణా చేసేందుకు వీలవుతుంది. ఇక పాడి పరిశ్రమ మరింత అభివృద్ధి చెందుతుంది. బెంగళూరు నుంచి తిరుపతికి సైతం ఈ మార్గం ఎంతో సౌలభ్యంగా ఉంటుంది. అందువల్ల ఈ రోడ్డు మార్గాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ప్రజాప్రతినిధులు, అధికారులపై ఎంతైనా ఉంది.

ఆరు కిలోమీటర్లు తారురోడ్డు వేస్తే చాలు..



పలమనేరు నుంచి మా గ్రామానికి ఇటీవలే తారు రోడ్డు నిర్మించారు. దీంతో బస్సులు వస్తున్నాయి. మా గ్రామం నుంచి దేవలంపెంట దాకా రోడ్డు ఉంది. అక్కడి నుంచి తుంబకుప్పానికి వెళ్లే దారిలో ఆరు కిలోమీటర్లు మాత్రం పెండింగ్‌లో ఉంది. దీన్ని నిర్మిస్తే మా గ్రామానికి ఎంతో మేలు.

– విజయ్, సర్పంచ్, జగమర్ల

రైతులకు ఎంతో మేలు..



మేము పండించిన పంటను బంగారుపాళెం, పుంగనూరు, చౌడేపల్లి, సోమలలకు తరలించాలంటే పలమనేరు హైవేలోకెళ్లి బంగారుపాళెం వెళ్లాలి. సోమల, చౌడేపల్లికి వెళ్లాలంటే పలమనేరుకు వెళ్లి చౌడేపల్లి, పుంగనూరు మార్గాల్లో చుట్టుకొని వెళ్లాల్సిందే. అదే తుంబకుప్పంరోడ్డు పనులు జరిగితే రైతులకు చాలా మేలుగా ఉంటుంది.

– రెడ్డెప్పరెడ్డి, జగమర్ల

మర్యాదపూర్వక కలయిక

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని కుప్పం ఎమ్మెల్సీ భరత్ విజయవాడలోని అసెంబ్లీ సమావేశాల సందర్భంగా కలిశారు. గురువారం సీఎంను కలిసి కుప్పం అభివృద్ధిపై సమీక్షించినట్లు భరత్ తెలిపారు.

– కుప్పం



కుప్పాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

కుప్పంరూరల్: కుప్పం మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ డా.సుదీర్ అన్నారు. గురువారం కుప్పం పట్టణంలో తిరుపతి గంగమ్మ దేవాలయం నుంచి చెరువు కట్ట వరకు రోడ్డు డివైడర్‌కు బటర్‌ఫ్లై లైట్లను ఏర్పాటు చేశారు. దీన్ని పరిశీలించిన ఆయన నాయకులతో కలిసి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడిగిన వెంటనే రూ.66 కోట్ల నిధులు కేటాయించారని, ఆ నిధులతో మున్సిపాలిటీని అన్ని విధాల అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగానే ఇప్పటికే మున్సిపాలిటీ మొత్తం డ్రైనేజీలు, సీసీ రోడ్లు నిర్మాణం చేపట్టామన్నారు. ఎక్కడ అవినీతి, నాసిరకానికి చోటు లేకుండా పనులు చేపడుతున్నట్లు చెప్పారు. కమిషనర్ రవిరెడ్డి, కౌన్సిలర్లు నాగరాజు, గణపతి, కుమ్మరేష్, ఇంతియాజ్ పాల్గొన్నారు.


లైట్ల ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ సుధీర్

నేడు కల్యాణోత్సవం

కుప్పంరూరల్: మండల పరిధిలోని డీకే పల్లిలో వెలిసిన ప్రసన్న అగ్నిమారెమ్మ జాతరలో భాగంగా శుక్రవారం అమ్మవారికి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త ప్రభాకర్‌నాయుడు తెలిపారు. 10వ తేదీ నుంచి జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారి ఉత్సవం, అన్నదానం, హరికథ, రాత్రి నాటకం గొప్పగా చేపట్టారు. శుక్రవారం అమ్మవారి పండరి భజన, హరికథ, నాటకం ఉంటుందని చెప్పారు. శనివారం రథోత్సవం, చివరి రోజు ఆదివారం అగ్నిగుండం, పుష్పపల్లకి, నయ్యాండి, బాణ వేడుకలు ఉంటుందని చెప్పారు. ప్రతిరోజూ అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించనున్నట్లు పూజారికుమార్ చెప్పారు.


పుష్పాలంకరణలో అగ్నిమారెమ్మ

ప్రజలకు అందుబాటులో ఉండాలి

బైరెడ్డిపల్లె: గ్రామాల్లో ప్రజల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని వైద్యాధికారి విజయ్‌చంద్ర ఆదేశించారు. బైరెడ్డిపల్లె పీహెచ్‌సీలో గురువారం ఆశావర్కర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ బాలికల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. దంతరక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నోటిశుభ్రత ప్రాముఖ్యతను వైద్యాధికారి పల్లవి వివరించారు. ఫ్యామిలీ వైద్యాధికారి శాలిని, హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైద్యాధికారి విజయ్‌చంద్ర

విధులకు సకాలంలో హాజరు కావాలి

పెద్దపంజాణి: గ్రామ సచివాలయ సిబ్బంది విధులకు సకాలంలో హాజరు కావాలని ఎంపీడీఓ టి. శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. గురువారం ఆయన సచివాలయ సిబ్బందితో మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగి హాజరు నమోదు విషయంలో క్రమశిక్షణ పాటించాలన్నారు. అత్యవసర సందర్భాలలో తప్పనిసరిగా మినహాయింపు ఇస్తామని, అయితే ముందస్తు సమాచారం ఇవ్వాలన్నారు. సచివాలయ సిబ్బంది హాజరును జిల్లా కలెక్టర్, డీఆర్వో, సీఈఓ సమీక్షిస్తున్నారని సిబ్బంది హాజరు విషయంలో నిర్లక్ష్యంగా ఉండవద్దని తెలిపారు.


మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస విశ్వనాథ్

19న గంగజాతర ప్రారంభం


సదుం: దున్నపోతును ఊరేగిస్తున్న నిర్వాహకులు

సదుం: మండల కేంద్రం సదుంతో పాటు పలు గ్రామాల్లో ఈనెల 19, 20 తేదీల్లో గంగజాతర నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా గురువారం దున్నపోతుకు పూజలు నిర్వహించి ఊరేగించారు. 19 అర్ధరాత్రి నడివీధిలో గంగమ్మను ప్రతిష్టించనున్నారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పిస్తారు. సోమవారం సాయంత్రం చెరువులో నిమజ్జనం చేయడంతో జాతర ముగియనుంది.

దాదేపల్లెలో ఆకట్టుకున్న ఖవ్వాలి


ఖవ్వాలీలో గాయకులు

చౌడేపల్లె: మండలంలోని దాదేపల్లెలోని మషాయక్ బహద్దూర్ అలీషా బాబా దర్గా వద్ద ఉరుసు పురస్కరించుకొని ఏర్పాటుచేసిన ఖవ్వాలి ప్రజలను ఆకట్టుకుంది. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు దర్గావద్ద నిర్వాహకులు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఖవ్వాలీ గాయకులు ముంబయికి చెందిన జీటీవీ సింగర్ కౌసర్ సాబరి, ఉత్తర ప్రదేశ్ సహన్‌పూర్‌కు చెందిన అస్లాం ముకరం సాబరి ఖవ్వాలీ గాయకులచే ఖవ్వాలీ, పాట కచేరి ప్రజలకు ఆకట్టుకొంది. దర్గా చుట్టూ పరిసర ప్రాంతాలు విద్యుద్దీపాలు , మక్కా మదీనా ఆకారంలో మిరుమిట్లు గొలిపే విద్యుద్దీలు, సువాసనతో కూడిన పూలు, అత్తర్ సెంట్‌లతో దర్గా ప్రాంగణం ఆకట్టుకొంది. పలువురు ప్రజలు కుల మతాలకు అతీతంగా దర్గా వద్దకు చేరుకుని బాబాకు పూలు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు, దువ్వా నిర్వహించారు. ఉరుసుకు హాజరైన ప్రజలకు అవసరమైన సదుపాయాలను మసీదు, ఉరుసు నిర్వాహక కమిటీ సభ్యులు ఏర్పాటుచేశారు. ప్రజలకు అన్నదానం ఏర్పాటుచేశారు.


విద్యుద్దీపాల అలంకరణలో దర్గా

నేడు తహ్లీహా ఫాతెహాతో ముగియనున్న ఉరుసు..

మూడురోజులుగా నిర్వహిస్తున్న దర్గా ఉరుసు శుక్రవారం తహ్లీహా ఫాతెహా కార్యక్రమంతో ముగియనున్నట్లు మత పెద్దలు తెలిపారు. మధ్యాహ్నం దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు, దువ్వా నిర్వహిస్తామన్నారు.